
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025 | 5

దండాలయ్యా..దీవించయ్యా!



గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు.. ఎక్కడా ఖర్చుకు వెనకాడకుండా సాగనంపుతున్నారు.. ఉండ్రాజవరం మండలం తాటిపర్రులో గౌడ సేవా సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపునకు ఏర్పాటు చేసిన వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. ట్రాక్టరును అలంకరించిన తీరు ఆకట్టుకుంది.. పెరవలి మండలం తీపర్రు కాపుల వీధిలో రూ. 3 లక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి.. శనివారంతో ముగియనున్నాయి..

- పెరవలి/ ఉండ్రాజవరం

జేసీగా మేఘ స్వరూప్



రాజమహేంద్రవరం,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వై.మేఘ స్వరూప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఆమె మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో జాయింట్ కలెక్టర్ పాత్ర అత్యంత కీలక మన్నారు. మేఘ స్వరూప్ 2020 సివిల్స్‌లో 31వ ర్యాంకు సాధించి శిక్షణ అనంతరం 2021లో విధుల్లో చేరారు. అనంతపురం జిల్లా గూటీలో పాఠశాల విద్య, వారాణసీలోని హిందూ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. తొలి పోస్టింగ్‌లో అనంతపురం మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.



ముస్లింల శాంతి ర్యాలీ



ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రాజమహేంద్రవరంలో శుక్రవారం భారీ శాంతి ర్యాలీ చేశారు. ఆజాద్ చౌక్ నుంచి అప్సర థియేటర్, డీలక్స్ సెంటర్, మెయిన్ రోడ్డు, పుష్కరఘాట్, దేవిచౌక్, కంబాల చెరువు, మల్లయ్యపేట ,క్వారీ సెంటర్, రామాలయం జంక్షన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ దానవాయిపేట మసీదు వద్ద ముగిసింది. - రాజమహేంద్రవరం సిటీ



ఆకాశమే హద్దు!

భవన నిర్మాణాల ఎత్తు 24 మీటర్లకు పెంచే యోచన

నగరాల్లో భవనాల ఎత్తు పెరగనుంది. అవసరమైతే పెంచుకోవడానికి, కొత్తవి పెంచి కట్టుకోవడానికి అవకాశం కలగనుంది. రాష్ట్రంలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నట్లు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తాజాగా ప్రకటించారు.దీనిపై శాసనసభలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెరుగుతున్న జనాభా అవసరాలు, పట్టణాభివృద్ధి దృష్ట్యా ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

(రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్- ఆంధ్రజ్యోతి)

ఇక అపార్ట్‌మెంట్లు ఆకాశహర్మ్యాలు కానున్నాయి. ఇప్పటి వరకూ ఐదంతస్తుల వరకే భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. అంటే 18 మీటర్ల కంటే ఎత్తు దాటి అపార్టుమెంట్లు,ఇతర భవనాలు నిర్మించకూడదు. 18 మీటర్ల ఎత్తు దాటితే వాటిని హైరైజ్ భవనాలు కింద పరిగణిస్తారు. వాటి నిబంధనలు,అనుమతులు వేరేగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం ఈ నిబంధన సడలించనుంది. సాధారణ అపార్ట్‌మెంట్ల ఎత్తు 24 మీటర్ల వరకూ పెంచనుంది.అప్పుడు ఏడం తస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం ఉంటు ంది.

జనం ఎదురుచూపులు..

ఇంత వరకూ సుమారు 400 గజాల్లో నాలుగంతస్తులు, 600 గజాల్లో ఐదంతస్తులు కట్టుకునేందుకు అనుమతి ఉంది. భవనాల ఎత్తును 24 మీటర్లకు పెంచడం వల్ల ఏడంతస్తులు కట్టుకోవచ్చు. స్థలం ఎక్కువ ఉంటే హైరైజ్ భవనాలు నిర్మించుకోవచ్చు. హైరైజ్ నిర్మాణాలకు అదనంగా సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డెవలప్ మెంట్ అథార్టీలు, రేరా అనుమతులతో పాటు ఎయిర్‌ఫోర్ట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ల అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. భూమి విలువ పెరగడం వల్ల హైరైజ్ భవన నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.దీంతో తక్కువ భూమిలో ఎక్కువ మంది నివసించే అపార్టుమెంట్ కల్చర్ మరింత పెరగనుంది.

కీలక మలుపు..

భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18మీటర్ల నుంచి 24మీటర్లకు పెంచే నిర్ణయం రాష్ట్ర పట్టణాభివృద్ధిలో కీలక మలుపుగా భావించవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లతో పాటు కాకినాడ జిల్లాలో నాలుగు, కోనసీమలో మూడు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మునిసిపాలిటీలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు సమతుల్యత కలుగుతుంది. బిల్లు శాసనసభలో ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర నిర్మాణ రంగం కొత్త దిశగా పయనించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ఇప్పటి వరకు ఐదంతస్తుల భవనాలే ఎక్కువగా నిర్మించారు. ఇకపై ఏడంతస్తుల భవనాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎత్తు మార్పు నిర్ణయం వల్ల కార్పొరేషన్లు, మున్సిపాల్టీలోని పట్టణ ప్రణాళికలో మార్పులు తప్పనిసరి కానున్నాయి. భవన సముదాయాల ఎత్తు పెరగనుండడంతో ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు నీరు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

తాజా నిర్ణయంతో లాభాలు

నగరాభివృద్ధికి ఊతం : భూమి వినియోగం సమర్థవంతం అవుతుంది.
గృహావసరాలు తీర్చడం : మరిన్ని ప్లాట్లు, అపార్టుమెంట్ల నిర్మాణానికి అవకాశం.
వాణిజ్య వృద్ధి : షాపింగ్‌మాల్స్, ఐటీ టవర్స్, వాణిజ్య సముదాయాలకు మార్గం.
ఆర్థిక లాభాలు : పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగనున్నాయి.

5 కాదు..ఏడంతస్తులు

హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఇప్పటికే ఆకాశహర్మ్యాలు నిర్మించారు. 150 మీటర్ల ఎత్తు వరకూ అనుమతి స్తున్నారు. 35 నుంచి 40 అంతస్తులు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మన ప్రాంతాల్లో అంత ఎత్తులో భవనాలు నిర్మించడానికి గతంలో అనుమతులు లేవు. సాధారణ అపార్ట్‌మెంట్లను ఐదంతస్తుల వరకే పరిమితం చేశారు..తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ అపార్ట్ మెంట్లను ఏడంతస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 8 వరకూ హై రైజ్ భవనాలు ఉన్నట్టు అధికారుల కథనం.

- ఇప్పటి వరకూ ఐదంతస్తులే
- 18 మీటర్లకే అనుమతి
- ఇక ఏడంతస్తుల మేడలు
- ఇక అన్నీ హైరైజ్ భవనాలే
- త్వరలో శాసనసభలో చర్చ
- ఎస్ఎఫ్‌టీపై అయోమయం
- పట్టణాభివృద్ధికి దోహదం
- నిర్మాణ రంగానికి కొత్త ఊపు
- మారనున్న పట్టణ ప్రణాళిక

అధిక ఇసుక లోడు.. కలెక్టర్ చర్యలు



రెండు లారీలపై కేసులు బుక్ చేస్తున్న జిల్లా రవాణా అధికారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు చేయవలసిన పనిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేసి చూపించారు.. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఇసుక లోడు చేయడంతో పాటు టార్పాలిన్ కప్పకుండా వెళుతున్న రెండు లారీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికా రికి అప్పగించారు. దీంతో ఆయన రూ. 1.20 లక్షల అపరాధ రుసుం విధించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం సాయంత్రం హుకుంపేట, పద్మా వతి నగర్‌లో పర్యటించి వస్తుండగా లాలా చెరువు వద్ద అధిక ఇసుక లోడుతో టార్పాలిన్ కప్పకుండా వెళుతున్న లారీ కనిపించింది. దాని వెనుక మరో లారీ ఉంది.ముందుకు వెళ్లి లారీని ఆపించి,అధిక లోడుపై ఆరాతీశా రు.అనంతరం అక్కడే లారీలను ఆపించి దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారిని ఆదేశించారు.ఈ మేరకు జిల్లా రవాణా అధికారి సురేష్ ఏపీ 13యుహెచ్9369 వాహనంపై చర్యలు తీసు కుంటున్నామని, రెండు లారీలపై కేసులు బుక్ చేసి, రూ.1.29 లక్షల అపరాధ రుసుం విధించారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డీఈవో వాసుదేవరావు తదితరులు



గురుపూజోత్సవంలో భాగంగా అలరించిన యువతుల నృత్య ప్రదర్శన

సమాజ ఉన్నతిలో గురువుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజ ఉన్నతిలో గురువుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి హాజరై మాట్లాడారు. గంట కొడితే ప్రసంగం ఆపే వ్యక్తి ఉపాధ్యాయుడు.. గంట కొట్టినా ప్రసంగం ఆపని వారు రాజకీయ నాయకులని సభలో నవ్వులు పూయించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నోబెల్ వృత్తి అని మన జీవితాన్ని ప్రభావితం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల ప్రభావం ఎప్పటికి నిలిచిపోతుందన్నారు.తాను కూడా ఒక టీచర్ బిడ్డనే అని గర్వంగా చెబుతున్నానన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పిల్లల జీవితాలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత కీలకంగా వ్యవహరించేది గురువులేనన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురువుల నుంచి ఆధునిక బోధకుల వరకు అందరూ పూజనీయులన్నారు. విద్యావిధానంలో సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారతీయ సంస్కృతి వికాసానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వదేశీ వస్తువులనే వినియోగించాలని పిలుపునిచ్చారు. నూతన జేసీ వై.మేఘ స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానంతో పాటు విలువలను ఉపాధ్యాయులు అందించాలన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత మాజీ రాష్ట్రప తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు, స్పెషల్ గ్రేడ్ టీచర్స్, ఉపాధ్యాయులు 87 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమం లో ఆర్ డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, డీఈవో కంది వాసుదేవరావు, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్,డీఐ బి.దిలీప్ కుమార్,ఎంఈవో తులసీదాస్ పాల్గొన్నారు.

87 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

గ్రామం	పేరు	స్కూల్
అనపర్తి	పి.వెంకటరెడ్డి	జడ్పీహెచ్ఎస్
పులగుర్త	కె.సీతామహాలక్ష్మి	జడ్పీహెచ్ఎస్
గోపాలపురం	కె.నారాయణరావు	జడ్పీహెచ్ఎస్
దుళ్ళ	బి.సుధ	జడ్పీహెచ్ఎస్
కొవ్వూరు	టీఎస్.రామానుజం	జడ్పీహెచ్ఎస్
పెనకమెట్ట	క్షమాకుమార్	జడ్పీహెచ్ఎస్
నిడదవోలు	ఎన్.భీమారావు	ఎంపీఎల్‌హెచ్
పెరవలి	కె.ఉమ	జడ్పీహెచ్ఎస్
కాతేరు	డి.అనిత	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	ఆర్.సన్యాసిరావు	ఎంపీఎల్‌హెచ్
పేరారామచంద్రపురం	వి.పద్మశ్రీ	జడ్పీహెచ్ఎస్
పందలపాక	డి.యువ రాజారెడ్డి	జడ్పీహెచ్ఎస్
మెల్లూరు	ఎండీ రసూల్ షరీఫ్	జడ్పీహెచ్ఎస్
ఇల్లపల్లి	ఎం.శారదాజ్యోతి	జడ్పీహెచ్ఎస్
దేవరపల్లి	ఓ.నాగరాజు	జడ్పీహెచ్ఎస్
దేవరపల్లి	కొయ్యల శ్రీనివాసరావు	జడ్పీహెచ్ఎస్
గోకవరం	ఆర్.కృష్ణవేణి	జడ్పీహెచ్ఎస్
గోపాలపురం	వై.దుర్గాప్రసాద్	జడ్పీహెచ్ఎస్
కడియం	యర్రంశెట్టి సూరిబాబు	జడ్పీహెచ్ఎస్
మధురపూడి	బొడ్డేటి వెంకట్రావు	జడ్పీహెచ్ఎస్
దోసకాయలపల్లి	బి.సాంబశివరావు	జడ్పీహెచ్ఎస్
పశివేదల	జీవీ.నాగతులసి	జడ్పీహెచ్ఎస్
పంగిడి	ఎస్‌కే.రషీదా	జడ్పీహెచ్ఎస్
తోగుమ్మి	జే.ప్రసన్నలక్ష్మి	జడ్పీహెచ్ఎస్
ముప్పవరం	ఎం.సత్యశ్రీనివాస్	జడ్పీహెచ్ఎస్
కోలమూరు	జి.ఫణీష్‌బాబు	జడ్పీహెచ్ఎస్
శాటిలైట్ సిటీ	వి.శ్రీనివాసు	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	సీహెచ్‌వీ.ప్రసాదరావు	ఎంపీఎల్ఎస్
	బీహెచ్.జేమిన	లూథరన్ ఎయిడెడ్
	బి.విజయకుమారి	ఎస్‌కేవీటీ
తుంగపాడు	బి.శ్రీను	జడ్పీహెచ్ఎస్
వెలుగుబంద	వై.అర్కేశ్వరరావు	జడ్పీహెచ్ఎస్
జి.దొంతమూరు	పి.కృష్ణమోహన్	జడ్పీహెచ్ఎస్
రంగంపేట	వి.క్రిష్టియన్ జాకబ్	జడ్పీహెచ్ఎస్
మిర్తిపాడు	రాపాక సూరిబాబు	జడ్పీహెచ్ఎస్
తిరుగుడుమెట్ట	పి.శ్రీనివాసరావు	జడ్పీహెచ్ఎస్
తాళ్ళపూడి	ఎం.రాజకుమారి	జడ్పీహెచ్ఎస్
చాగల్లు	వి.రామలక్ష్మి	ఎంపీపీఎల్ఎఫ్
వేళ్లచింతలగూడెం	ఎన్‌సీహెచ్.రత్నకుమారి	ఎంపీపీఎస్
వాడపల్లి	బి.ప్రసాద్	ఎంపీపీఎస్-2
నల్లజర్ల	మానుకొండ గంగరాజు	ఎంపీపీఎస్-1
రాజమండ్రి	ఎస్ఎస్‌వీ.రామారెడ్డి	ఎంపీపీఎస్
చాగల్లు	పి.శ్రీనివాసమూర్తి	ఎంపీపీఎస్
చంద్రవరం	రాజన రామాంబ	ఎంపీయూపీఎస్
యర్నగూడెం	పుల్లాకుల గంగరాజు	ఎంపీపీఎస్
మల్లవరం	యాళ్ళ అబ్రహాం పౌలు	డీవీపీఆర్ఎయూపీ
కామరాజుపేట	చొల్ల రాజ్‌కుమార్	ఎంపీపీఎస్
చిట్యాల	సీహెచ్ సూర్యచంద్రం	ఎంపీపీఎస్
కడియం	కరటపు గంగాభవాని	ఎంపీపీఎస్-2
వెంకాయమ్మపేట	ఎంటీ.రత్నం	ఎంపీపీఎస్
వెస్ట్‌గానుగూడెం	టీఎస్ఏ.లక్ష్మి	ఎంపీపీఎస్-2
గాడాల	కే.పూర్ణచంద్రారెడ్డి	ఎంపీపీఎస్-2
తెలికిచర్ల	పాలరత్నాల నాగరాజు	ఎంపీపీఎస్ -1
ఘంటావారిగూడెం	ఎం.శ్రీనివాసరావు	ఎంపీపీఎస్ -3
పందలపర్రు	డి.భాస్కరం	ఎంపీపీఎస్-2
పెరవలి	పి.శ్రీనివాసకుమార్	ఎంపీపీఎస్
లంకమాలపల్లి	కే.దుర్గాదేవి	ఎంపీపీఎస్
రాజవోలు	పీటీఎస్‌కే.ప్రసాద్	ఎంపీపీఎస్
వెలుగుబంద	బి.పవన్ కుమార్	జడ్పీహెచ్ఎస్
కొండగుంటూరు	మావులు భగవాన్	ఎంపీపీఎస్
రామకృష్ణాపురం	ఆర్.వెంకటేశ్వరరావు	ఎంపీపీఎస్
సింగంపల్లి	సీహెచ్ గౌతమ్ కృష్ణ	ఎంపీపీఎస్
బొబ్బిల్లంక	ఏ.మేరికుమారి	ఎంపీపీఎస్
రఘుదేవపురం	జీవీ.పల్లయ్యగుప్తా	ఎంపీపీఎస్-2
గజ్జరం	వై.శంకరం	ఎంపీపీఎస్
కాల్దరి	పి.కుసుమ	ఎంపీపీఎస్-2
రాజమండ్రి	ఎంవీఎం.సుబ్రహ్మణ్య	జడ్పీహెచ్ఎస్
చంద్రేడు	జి.రమణబాబు	జడ్పీహెచ్ఎస్
పెంటపల్లి	కె.వీర్రాజు	ఎంపీయూపీఎస్
ఈస్ట్ చోడవరం	కె.సుబ్రహ్మణ్యేశ్వరస్వామి	జడ్పీహెచ్ఎస్
పెరవలి	జే.బాలకృష్ణకుమార్	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	కె.ఉషాపద్మశ్రీ	మునిసిపల్
వడిశలేరు	జి.ఇందుమతి	జడ్పీహెచ్ఎస్
ప్రభాకర్‌నగర్	యు.రామకృష్ణ	జడ్పీహెచ్ఎస్
సింగవరం	జీవీవీ.దుర్గాప్రసాదరావు	ఎంపీపీఎస్
మలకపల్లి	ఏఎస్‌వీ.రామ్మోహన్‌రావు	జడ్పీహెచ్ఎస్
బొమ్మూరు	చిటికెన చేతనలక్ష్మి	గురుకులం
జయకృష్ణపురం	కొండ డేవిడ్‌లివింగ్‌స్టన్	ఎంపీపీఎస్
బ్రాడీపేట	ఎం.సుసన్నాజెస్సీ	ఎంపీఎల్
కడియం	పి.రామనాగేశ్వరి	జడ్పీహెచ్ఎస్
గాడాల	ఎస్‌వీబీ.శ్రీనివాసరావు	ఎంపీపీఎస్

గురుదేవోభవ


తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.


కాకినాడ జిల్లా కాకినాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయురాలు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ

● వరద ముంపు గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష పర్యటన


వడ్డిగూడెంకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

వీఆర్‌పురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి శుక్రవారం ముంపు గ్రామాల్లో ట్రాక్టర్‌పై పర్యటిస్తూ ... బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా ముంపులో ఉన్న వడ్డిగూడెంకి వెళ్లి గ్రామ స్థులతో మాట్లాడారు. ఈ సం దర్భంగా వారంతా మాట్లాడుతూ గత 15 రోజు లుగా గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మాకు పూర్తిస్థాయి సాయం అందలేదన్నారు. వరద సాయం ముఖ్యం కాదు, పోలవరం ప్యాకేజీ పూర్తిస్థాయిలో త్వరగా అందించాల న్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ బాధితులందరికీ వరద సాయం అందిస్తామని, అలాగే పోలవరం బాధితులకు నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా అందించేందుకు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బోట్‌పై శబరిగుండా ముంపులో ఉన్న రామవరం, చింతరేగుపల్లి, తదితర గ్రామాలకు వెళ్లారు. ఈమెతోపాటు మండల టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

హైలెస్సా ....!

● నిలిచిన ఆర్టీసీ.. నెట్టిన ఆటో డ్రైవర్లు


రౌతులపూడిలో బస్సును నెడుతున్న ఆటో డ్రైవర్లు

రౌతులపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సినిమా సెంటర్ రహదారి మధ్యలో శుక్రవారం ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. ఇటీవల కాలంలో తరచూ బస్సులు మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోటనందూరు నుంచి కాకినాడ వెళుతున్న బస్సు రౌతులపూడి వచ్చింది. అక్కడ గల మహాలక్ష్మి విశ్రాంతి భవనం వద్ద ప్రయాణికులు ఎక్కిన తరువాత బస్సు కదల్లేదు. రహదారి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దాన్ని గమనించిన ఆటోడ్రైవర్లు హైలెస్సా అంటూ నెట్టిన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇలా క్లిక్‌మనిపించింది.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



తూర్పుగోదావరి జిల్లా నుంచి

నక్కిన వీర రాఘవరావు, జడ్పీహెచ్‌ఎస్, కుతుకులూరు.

మోతూరి మంగరాణి, ఎంపీఎల్, లాలాచెరువు.

బత్తిన రాజరాజేశ్వరి, జడ్పీహెచ్‌ఎస్, ప్లస్ శాటిలైట్ సిటీ (బీ బ్లాక్).

కాకినాడ జిల్లా నుంచి



కోటంరాజు గాయత్రి, జడ్పీహెచ్‌ఎస్, ఏపీఎస్పీ, రమణయ్యపేట .

పతివాడ రవిశంకర్, జడ్పీహెచ్‌ఎస్, కొమరగిరి.

బొబ్బాది ప్రవీణ్‌కుమార్, జడ్పీహెచ్‌ఎస్, కొత్త పెరుమాళ్లపురం.

విజయవాడలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు.

కోనసీమ జిల్లా నుంచి




గూడెపల్లి ప్రభావతి, జడ్పీహెచ్‌ఎస్, సఖినేటిపల్లి

ఆలేటి దుర్గాప్రసాద్, ఏపీ మోడల్ స్కూల్ , అవిడి

చిట్టినీది నిరంజని, జడ్పీహెచ్‌ఎస్, కాట్రేనిపాడు.

ఎడమ వైపు నుంచి..

చిరుత కలకలానికి...
నిన్నటితో ఏడాది


దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో సంచరించిన చిరుత (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు అటవీప్రాంతంలో చిరుతపులి కలకలం సృష్టించి సరిగ్గా శుక్రవారంతో ఏడాది పూర్తి అయ్యింది. అప్పట్లో చిరుత సంచారంతో ఇక్కడిప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. కాగా, అటవీ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది కూడా ఒక కారణమయ్యింది. దివాన్‌చెరువు సమీపంలోని పుష్కరవనం వైపు నుంచి అర్ధరాత్రి సమయంలో ఒక చిరుత రాష్ట్ర అటవీ అకాడమీ వైపు వెళ్లిందన్న వార్తలతో ప్రజలు భయాందోళన చెందారు. దీంతో జిల్లా అటవీ అధికారులు చిరుత పులి ఉనికికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసి.. కదలికపై ట్రాప్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎట్టకేలకు దాని పాదముద్రలు గుర్తించి అటవీ అకాడమీ వెనుక గల అభయారణ్యంలో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారించారు. అలాగే బోను కూడా సిద్ధం చేశారు. అయితే దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నిసార్లు దాని కదలికలను ట్రాప్‌కెమెరాలలో అధికారులు కనుగొన్నప్పటికీ తప్పించుకోగలిగింది. ప్రజాభద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీఅధికారులు స్థానికులకు పలు సూచనలు చేసి సహకరించాలని కోరారు. అనంతరం ఈ చిరుత కడియం వైపు వెళ్లినట్టు వార్తలు రావడంతో ఈప్రాంత ప్రజలు ఆందోళన నుంచి బయటపడ్డారని చెప్పొచ్చు.

రేపు చంద్రగ్రహణం

- తెరిచే ఉండనున్న పాదగయ క్షేత్రం
- గ్రహణ సమయంలో అభిషేకాలు
- పుష్కరిణిలో పట్టు విడుపు స్నానాలు


పిఠాపురంలోని పాదగయ క్షేత్రం


చంద్రగ్రహణం సమయంలో తెరిచి ఉంచే కుక్కుటేశ్వరుని ఆలయం

పిఠాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రహణ సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేస్తారు. కేవలం రెండు ఆలయాలు తప్ప. అందులో ఒకటి శ్రీకాళహస్తి, మరొకటి కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షే త్రం. గ్రహణ సమయంలో ఈ రెండుచోట్లా పూ జలు జరుగుతాయి. రాష్ట్రంలో ఈనెల 7వ తేదీ రాత్రి చంద్రగ్రహణం ఏర్పడుతోంది.ఈ నేపథ్యం లో ఆ రోజు మధ్యాహ్నం నుంచే అన్ని ఆలయాలను మూసివేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. ఈ సమయంలో పిఠాపురం పాదగయ క్షేత్రం లో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం తెరిచే ఉంటుంది. ఇక్కడ యథావిధిగా పూజలు జరుపుతారు. గ్రహణ సమయంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. గ్రహణ పట్టు, విడుపు సమయాల్లో పాదగయ పు ష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరిస్తున్నారు. పురాతన కాలం నుంచీ వస్తున్న సం స్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా పాదగయ క్షేత్రా న్ని గ్రహణ సమయంలో తెరిచి ఉంచి కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ వేద పండితులు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

అప్పనపల్లి ఆలయం మూసివేత

మామిడికుదురు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీబాలబాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయం తెరుస్తామని తెలిపారు. అప్పటి నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు

మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం


మంత్రి దుర్గేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌కు కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కేశిరాజు రాంప్రసాద్, అడ్డాల నాని తదితరులున్నారు.

కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్
అధ్యక్షుడిగా సూరిబాబు ప్రమాణ స్వీకారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన మిల్లర్లు


నూతన అధ్యక్షుడు సూరిబాబును సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) శుక్రవారం ప్రమాణం చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని అచ్చంపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో అంబటి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శిగా కొత్త భైరవకృష్ణ, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామానుజయ్య, కార్యదర్శిగా మొగలి అప్పారావు ప్రమాణ స్వీకారం చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి సూరిబాబు కృషి చేస్తారనే విశ్వాసం అందరిలోనూ ఉందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాజరైన రైస్ మిల్లర్లు సూరిబాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.పారిశ్రామికవేత్తలైన లలితా ఎంటర్‌ప్రైజెస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాసు, చింతల శ్రీనివాసు, గుమ్మళ్ల సత్యనారాయణ, జొన్నాడ సందీప్, ఈదర చౌదరి, కొండపల్లి కృష్ణమూర్తి, తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి రవిబాబు పాల్గొన్నారు.

శిష్యుల గురుభక్తి

- పెనికేరులో ఉపాధ్యాయుడి విగ్రహం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు


పెనికేరులో కుడిపూడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో జైశంకర్ పేరుతో ప్రైవేట్ స్కూల్‌ను ఏర్పాటుచేసి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పిన కుడిపూడి వెంకటరమణమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ స్కూల్లో చదివిన విద్యార్థులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్, టీడీపీ నాయకుడు ఈదల చినబాబు ఆవి ష్కరించి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. మాస్టారు కుటుంబానికి పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గురువు వెంకటరమణ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శిష్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న డొంకరాయి జలాశయ నీటిమట్టం

మోతుగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి జలాశయం నీటిమట్టం పెరుగుతోందని జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నుంచి ఏ రోజైనా జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ప్రకటించారు. శుక్రవారం రాత్రి 10గంటలకు మొదటి నుంచి 3వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నారు. జలాశయానికి దిగువున ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి తగ్గుముఖం పడుతోంది. గురువారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుని శుక్రవారం ఉదయం 9గంటల వరకు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ ద్వారా 9,41,785 క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం రాత్రి 7గంటలకు 11.20 అడుగులకు చేరుకోగా 9లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.

గణనాథుడి నాణేనికి 409 ఏళ్లు



మండపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్యం రాకముందు మన దేశాన్ని పాలించిన ఈస్ట్ ఇండియా పాలకులు మన దేశ సనాతన ధర్మ, మత ఆచారాలను కూడా ఆచరించే వారు. హిందూ దేవుళ్లపై భక్తితో వారు 1616వ సంవత్సరంలో వినాయకుడు ప్రతిమను రెండనాల రాగి నాణెంపై ముద్రించి హిందూ ధర్మం పట్ల వారి కున్న భక్తిని చాటుకున్నారు. ఆనాటి నాణం నేటికీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన తోరాటి నాగభూషణం వద్ద భద్రంగా ఉంది. ఆ నాణేనికి నేటికి 409 సంవత్సరాలు వయస్సు ఉండడం గమనార్హం.

10 నుంచి 'యోగా ఇన్నర్ ఇంజనీరింగ్'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు కాకినాడలో యోగా ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.నగరంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాచీన యోగశాస్త్రాల సారాంశమైన ఇన్నర్ ఇంజినీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేసి ఆనందకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. రామకృష్ణారావుపేటలోను, వెంకటరత్నపురం గాంధీభవన్‌లోను ప్రతిరోజూ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. 10వ తేదీ సాయంత్రం పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96181 18529 నెంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రూ.1.11 లక్షలు పలికిన గణపతి లడ్డూ


రూ.1.11 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న వీరబాబు

యానాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యానాం పిల్లారాయవీధిలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్ స్వామి (లక్ష్మీగణపతి) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. 54 కిలోల లడ్డూను రూ.1.11లక్షలకు వీరబాబు(మసాల) కైవసం చేసుకున్నాడు. స్థానిక త్యాగరాయవీధిలోని శ్రీశివరాజ విద్యాగణపతికి పెన్నులతో పూజ నిర్వహించారు. పూజల అనంతరం పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

అవంతినగర్‌లో రూ.1.05 లక్షలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు అవంతినగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి, బుద్ధి గణపతి మండపంలో స్వామివారికి 45 కిలోల లడ్డూ సమర్పించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో కాలనీవాసులు దానిని రూ.1.05 లక్షలకు సొంతం చేసుకున్నారు.అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జనసేన సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


లడ్డూను సొంతం చేసుకున్న అవంతీనగర్ వాసులు

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు.ఈ కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేద పండితుల పవిత్ర మంత్రోచ్ఛారణల నడుమ బంగారం, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనరు కురందం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

10న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని సీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

అంచనాలకు ఆమోదం..

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస పనులపై పాలకమండలి సమావేశం
- రూ.5.13 కోట్లతో గ్రావెల్‌రోడ్డు, వన్‌వే, పార్కింగ్ సౌకర్యాలకు అంచనాలు
- రూ.5.25 లక్షలతో తాత్కాలిక మరుగుదొడ్లు
- రూ.10 లక్షలతో వాటర్‌ప్రూఫ్ షామియానాలు ఏర్పాటు
- గిరి ప్రదక్షిణకు రూ.7.70 లక్షలతో పనులు
- తెప్పోత్సవానికి రూ.5.50 లక్షలతో వివిధ పనులకు చైర్మన్ గ్రీన్‌సిగ్నల్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇతర అవసరాల ప్రధాన అజెండాలుగా శుక్రవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో చైర్మన్ రోహిత్ ఆమోదం తెలిపారు. ప్రధానంగా రూ.5.13 కోట్లతో హరిహర మార్గ్ పార్కింగ్, వన్‌వేగా హరిహరసదన్ వెనక నుంచి సత్యగిరి జంక్షన్‌కు వన్‌వేగా ఆదిశంకర్ మార్గ్ మీదుగా కొండదిగువకు వెళ్లేందుకు అవసరమైన గ్రావెల్ రోడ్డు వేయడానికి తయారుచేసిన అంచనాలకు చైర్మన్ ఆమోదం తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున లక్షలాది భక్తులు గిరిప్రదక్షిణకు విచ్చేయనున్న నేపథ్యంలో స్టాల్స్ ఏర్పాటు, పలుచోట్ల టెంట్‌లు, షామియానాలు, టాయిలెట్ల ఏర్పాటుకు రూ.7.70 లక్షల అంచనా పనులకు ఆమోదం లభించింది. క్షీరాబ్ది ద్వాదశిరోజున స్వామివారి తెప్పోత్సవం జరగనున్న నేపథ్యంలో రూ.5.50 లక్షలతో వివి పనులు చేపట్టేందుకు, రూ.5 లక్షలతో పడమర రాజగోపురం వద్ద షెడ్లు, గ్రీన్ మ్యాట్, హోల్డింగ్ పాయింట్ల ఏర్పాటుకు, రూ.10 లక్షలతో రూ.2వేలు, రూ.1500 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ హాల్స్, వాటర్ ప్రూఫ్ షామియానాల ఏర్పాటుకు తయారుచేసిన అంచనాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.28 లక్షలతో కొండదిగువ పవర్ హౌస్ నుంచి కొండపైకి విద్యుత్ సరఫరా కోసం అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా రెండో లైన్ ఏర్పాటుకు, రూ.11.50 లక్షలతో అన్నవరం దత్తత దేవాలయమైన బలిఘట్టం సత్యదేవుడి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు, రూ.5.25 లక్షలతో వివిధ ప్రాంతాల్లో 22 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు, రూ.4.50 లక్షలతో పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద స్విచ్‌బోర్డుల ఏర్పాటు తదితర పనులను ఆమోదించారు. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగవేలంలో హెచ్చుపాటలను, దేవస్థానానికి అవసరమైన పనులకు లోయెస్ట్ టెండర్లు ఆమోదించారు. సమావేశంలో ఈవో సుబ్బారావు, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఏర్పాట్లపై సమీక్ష



అన్నవరంలో కార్తీకమాస ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్న ఈవో, చైర్మన్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో సత్యదేవుడి సన్నిధికి అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఈ ఏడాది కార్తీకమాసంలో 13 రోజులు పర్వదినాలుగా, మిగిలిన రోజులు సాధారణ రోజులుగా గుర్తించారు. పర్వదినాల్లో రోజుకు లక్షపైబడి, సాధారణ రోజుల్లో సుమారు 50వేలమంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్రతం, దర్శనం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, గతేడాది తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని చైర్మన్ రోహిత్ సూచించారు. సెక్యూరిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు



కాకినాడలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాలు ఎన్ని జరుగుతున్నాయి, ఏ విధంగా జరుగుతున్నాయి అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం కాకినాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలతో కూడిన ఆడిట్ నిర్వహించారు. కోనసీమ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు ఆధ్వర్యంలో కాకినాడలోని డాక్టర్ వీర్రాజు హాస్పటల్, భాను నర్సింగ్ హోం, సన్‌రైజ్ హాస్పటల్, టీమ్ హాస్పటల్, అమృత మదర్ అండ్ చైల్డ్ హాస్పటల్‌లలో ఆడిట్ నిర్వహించారు. ప్రైవేటు హాస్పటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ ప్రసవాలను పెంచాల్సిన అవసరం చాలా ఉందని సూచించారు. తొలి కాన్పులో సాధారణ ప్రసవ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో అనే విషయాలను ఆసుపత్రులకు వచ్చే గర్భిణులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులకు సూచించారు. అలాగే కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం కోనసీమ జిల్లాలో ఆడిట్ నిర్వహించింది. కాకినాడలో చేసిన ఆడిట్‌లో డీఐవో డాక్టర్ బివివి సత్యనారాయణ, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరత్‌లక్ష్మి, ఎస్‌వో కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హత్య

- విడాకులు తీసుకుని కుమార్తె పెళ్లి కోసం కలిసిన జంట
- భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం
- రోజూ మద్యం మత్తులో వీడియో కాల్స్
- కోపంతో భర్త తలపై ఇనుపరాడ్‌తో బలంగా కొట్టి చంపిన భార్య

వివాహమై ఆడబిడ్డ పుట్టిన తరువాత భార్యాభర్తలిద్దరికీ పొసగలేదు. దాంతో విడాకులు తీసుకుని విడిపోయారు. కానీ కుమార్తె పెళ్లిలో కన్యాదానం కోసం పెద్దల మాట విని మళ్లీ కలుసుకున్నారు. అయితే భర్త రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్నాడనే కోపంతో అర్ధరాత్రి కిరాతకంగా కొట్టి చంపింది భార్య. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడిలో జరిగింది.



రాంబాబు మృతదేహం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నడిపూడి గ్రామం బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం సమీపంలో దొమ్మేటి రాంబాబు (61), భార్య వెంకటరమణతో సొంతింట్లో జీవించేవాడు. రాంబాబు కాకినాడ హెడ్ క్వార్టర్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్నాడు. రాంబాబు, వెంకటరమణ కాపురం కొంతకాలం సజావుగానే సాగింది. వారికి కుమార్తె హేమ జన్మించింది. భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. హేమ తండ్రి వద్దనే ఉంది. విడిపోయిన భార్య వెంకటరమణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి కొంతకాలం పనిచేసుకుని తిరిగి స్వదేశానికి చేరుకుంది. కాలక్రమంలో కుమార్తె హేమకు పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. దాంతో విడిపోయిన భార్యభర్తలు కలిసి కన్యాదానం చేయించాల్సిన పరిస్థితిపై రాంబాబు కుటుంబసభ్యులు చర్చించుకున్నారు. దాంతో పెద్దల సమక్షంలో కలిసి కుమార్తె వివాహాన్ని జరిపించారు. కుమార్తె నరాల హేమ కుటుంబం ప్రస్తుతం చెన్నైలో జీవిస్తున్నారు.

ఒకే ఇంట్లో ఉన్నా కానీ...

ఈ నేపథ్యంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నప్పటికీ ఒకే ఇంట్లో దూరంగా ఉంటున్నారు. రాంబాబు భోజనాన్ని కూడా బయట నుంచి తెచ్చుకుని తినేవాడు. అతడు గత కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న తీరుపై వెంకటరమణ కక్ష పెంచుకుంది. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాంబాబు 12 గంటల వరకు ఫోన్‌లో మాట్లాడినట్టు చెప్తున్నారు. ఆ తరువాత మద్యం మత్తులో మంచంపై పడి ఉన్న రాంబాబును భార్య వెంకటరమణ ఇనుపరాడ్‌తో తలపై బలంగా మోదడంతో చనిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులకు ఫోన్ చేసి గుండెపోటుతో రాంబాబు మృతి చెందినట్టు భార్య సమాచారం ఇచ్చింది. నడిపూడి చేరుకున్న బంధువులు మృతదేహం పడి ఉన్నతీరు, మంచం నిండా రక్తం మరకలు గుర్తించి వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో కలిసి శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో భార్య వెంకటరమణ తలపై ఇనుపరాడ్‌తో బలంగా మోదడం వల్లే రాంబాబు మృతిచెందినట్టు గుర్తించారు. రావులపాలేనికి చెందిన మృతుడికి కుమారుడు వరుసైన దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఇది ఒక్కరి పనేనా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తాలూకా ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని నియమించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామసూర్యనారాయణ



మాట్లాడుతున్న రామసూర్యనారాయణ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసేందుకు వెనుకాడబోనని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు బకాయి పడ్డ డీఏలు, ఎరెండ్ లీవ్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాషాజీ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం కొంకాపల్లి ఏవీఆర్ నగర్‌లోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఉద్యోగులారా.. రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించగా రామసూర్యనారాయణ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25వేల కోట్లకు చేరాయన్నారు. ప్రతీ నెల 1న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని గత ప్రభుత్వంలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినందుకు తప్పుడు కేసులు పెట్టి నాతో పాటు కుటుంబ సభ్యులను సైతం వేధించారని, చివరకు హత్య చేసేందుకు కూడా ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడానికి చొరవ తీసుకుని బకాయిలు ఎంతో ముందు లెక్క తేల్చాలన్నారు. వాటికి చట్టబద్ధత కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, కోశాధికారి జేఏ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్, కొప్పిశెట్టి వెంకటగణేష్, సహ కార్యదర్శి పి.శివకుమార్, పెన్షనర్ల సంఘ నాయకుడు కేకేవీ నాయుడు, ఎస్వీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తి, పి.కామేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, వి.సద్గుణరావు, ఎంవీవీఎన్ ప్రసాద్, కొమ్ముల స్వామినాయుడు, శ్రీమన్నారాయణ, వర్మ, పాండురంగారావు తదితరులు ఉన్నారు. వీఆర్వోల సంఘ ప్రతినిధులు ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామసూర్యనారాయణను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బాషాజీ పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకున్న యువకుడు

ఎటపాక, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గా లేక ఆదివాసీ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం బాసవాగు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలోని పూసుపల్లి గ్రామానికి చెందిన కర్మామి జోగా (24) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 1న స్వగ్రామంలో కుటుంబసభ్యులతో గొడవపడి ఈ ప్రాంతానికి వచ్చాడు. రెండురోజుల క్రితం రాంగో పాలపురం జాతీయ రహదారిపై ఒంటి పై దుస్తులు లేకుండా తిరిగాడని చెప్తున్నారు. ఈ క్రమంలో బాసవాగు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సులభంగా డబ్బు సంపాదనకు దొంగతనాలు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.11,58,500 విలువైన ఆభరణాలు, రూ.2.80 లక్షల నగదు స్వాధీనం



రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

రాజోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,58,500 విలువచేసే 64 గ్రాముల బంగారం, 2కిలోల 859 గ్రాముల వెండి, రూ.2లక్షల 80వేల నగదును స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ తెలిపారు. రాజోలు పోలీసుస్టేషన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వారు నిందితుల వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరానికి చెందిన కె.అర్జున్ డిగ్రీ వరకు చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడి సరైన సంపాదన లేక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు ప్రారంభించాడు. అర్జున్‌పై కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో పదికి పైగా దొంతనాల కేసులు ఉన్నాయి. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం గొల్లగూడెనికి చెందిన ఎస్.మంగప్రసాద్ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన షేక్ బాషీ వెండి పట్టీలు తయారుచేస్తూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడిపై మారేడుమిల్లి పోలీసుస్టేషన్‌లో గంజాయి రవాణా చేసినందుకు కేసు నమోదైంది. కాకినాడకు చెందిన షేక్ అజీజ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. అయితే ఈ నలుగురు మద్యం, విలాసాలకు అలవాటు పడి వచ్చే ఆదాయం సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేశారు. ఈ నలుగురిని రాజోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కోనసీమ జిల్లా ఎస్పీ బీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, సిబ్బంది, రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బంది నిందితులను పట్టుకున్నారు. ముగ్గురిని రాజోలు మండలం బి.సావరంలో, ఒకరిని కాకినాడలో అరెస్టు చేశామని తెలిపారు. నిందితులకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పరిచయడం ఏర్పడిందని, తర్వాత ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరుచగా రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ నరేష్‌కుమార్, క్రైమ్ ఎస్ఐ గజేంద్రకుమార్, ఎస్ఐ పరదేశీ, ఏఎస్ఐ బాలకృష్ణ, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చిట్టీల వ్యాపారి రూ.40 కోట్లకు కుచ్చుటోపీ

కుటుంబంతో సహా పరారీ, కేసు నమోదు



వీరశంకరరావు కుటుంబం

ఐ.పోలవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో చిట్టీల వ్యాపారి సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఐ.పోలవరం మండలంలోని పశువుల్లంక గ్రామానికి చెందిన చింతలపూడి వీరశంకరరావు గత కొన్నేళ్లుగా మురమళ్ళ, ముమ్మిడివరం, కాకినాడ తదితర ప్రాంతాల్లో చిట్టీల పేరుతో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవాడు. అయితే సభ్యులకు సొమ్ము చెల్లించకుండా సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి కుటుంబంతో సహా పరారైనట్టు బాధితులు ఐ.పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరశంకర్రావు లక్ష నుంచి రూ.కోటి వరకు చిట్టీలు నిర్వహించేవాడు. గత కొన్ని రోజుల క్రితం కుటుంబంతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం బాధితులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి తమకు జరిగిన మోసంపై మొరపెట్టుకున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మండపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల వేములపల్ల బంగారమ్మ కాలనీకి చెందిన మానేపల్లి లక్ష్మణ్ (16) గురువారం రాత్రి 11గంటల సమయంలో రైలు ఢీకొని మరణించాడు. శుక్రవారం లక్ష్మణ్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటనపై రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్ట్

12 వాహనాల స్వాధీనం



బైక్ దొంగలను పట్టుకున్న కోరుకొండ పోలీసులు

కోరుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌లను పట్టుకుపోతున్న దొంగల ముఠాను కోరుకొండ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 స్కూటీలు, ఒక స్ప్లెండర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను మీడియాకు వెల్లడించారు. గాదరాడకి చెందిన అల్లాడి విజయ్‌కుమార్ పాత నేరస్తుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. మద్యం, జూదానికి బానిసై బైక్‌లు దొంగతనాలు చేస్తున్నాడు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 బైక్‌లు, రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో 4 బైక్‌లు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, సీతానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, ప్రకాష్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వెరసి 12 బైక్‌లు దొంగిలించాడు. విజయ్‌కుమార్, వనుం సురేష్, వనుం లోవరాజు బైక్ దొంగతనాల్లో భాగస్తులు. సీఐ వై.సత్యకిషోర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఈ ముగ్గురిని శుక్రవారం ఎస్ఐ నాగార్జున, సిబ్బంది గాదరాడ గ్రామ శివారులో అదుపులోకి తీసుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగార్జున, హెచ్‌సీ శ్రీను, కానిస్టేబుల్స్ పవన్ వరప్రసాద్, బాపినాయుడులను అభినందించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

బాధిత మహిళకు బంగారు ఆభరణాల అందజేత



మహిళకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

పిఠాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రికవరీ చేసిన బంగారు ఆభరణాలను బాధిత మహిళకు పిఠాపురం పోలీసులు శుక్రవారం అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం కుంతీమాధవస్వామి గుడి వీధిలో నివాసముంటున్న ఆశా కార్యకర్త కృష్ణవేణికి చెందిన బంగారు ఆభరణాలు గతేడాది సెప్టెంబరులో చోరీ అయ్యాయి. రూ.5లక్షలు విలువైన బంగారు నగలు చోరీపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు అనుసరించి హైదరాబాద్‌కు చెందిన సోమరాజు, సుమంత్ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారిని విచారించగా హైదరాబాద్‌లోని ఓ బస్టాండులో బ్యాగు, అందులో ఉంచిన బంగారు ఆభరణాలను చోరీ చేసినట్టు తెలిపారు. వారి వద్ద ఉన్న 4 బంగారు గాజులు, చైను, పుస్తెల తాడు, 2 ఉంగరాలు వెరసి 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో బాధితురాలికి శుక్రవారం సదరు ఆభరణాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అందజేశారు. తన ఆభరణాలను తిరిగి అప్పగించిన సీఐ, ఎస్ఐను కృష్ణవేణి, ఆమె కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు.

తంటికొండ ఆలయ పునర్నిర్మాణానికి ప్రణాళికలు


దేవదాయ శాఖ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంటికొండ దేవస్థానం పునర్నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మండలం తంటికొండపై స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దేవదాయశాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన దర్శించుకన్నారు. వారికి దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి అప్పన్నదొర స్వాగతం పలికారు. అనంతరం దేవదాయ ఉద్యోగులు, ఇంజనీర్లతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే నెహ్రూ టీటీడీ బోర్డు సభ్యుడిగా తనకున్న అవకాశాన్ని వినియోగించుకుని తంటికొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కనీస వేతనాలు పెంచుతూ జీవో ఇవ్వాలి'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కంపెనీలకు ఆఘమేఘాలపై జీవోలు ఇస్తున్న ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని శ్యామలాసెంటర్ వద్ద సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెస్ట్ ప్రైస్ షాపు వ్యాపారానికి రాత్రి సమయంలో అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కనీస వేతనాలు పెంచుతూ జీవో జారీ చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా ఆఫీస్‌బేరర్లు పాల్గొన్నారు.

'నన్నయలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థి, యువజన, దళిత సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని అంబేడ్కర్ భవన్ ఆవరణలో డీవైఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ డి.అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి సమావేశానికి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు విచ్చేసి మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందుగానే వివిధ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నామని అన్నారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ ఓపెన్ చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్‌లోని టౌన్ హాల్‌లో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ ఓపెన్ చెస్ పోటీలు జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు www.apchess.org వెబ్‌సైట్ ద్వారా పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ఇద్దరు నంద్యాలలో ఈ నెల 13,14 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను ఈ నెల 6వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ 98483 74133 నెంబర్‌ను సంప్రదించాలని కుమార్ కోరారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.మేఘస్వరూప్‌ను పలువురు జిల్లా బీజేపీ నాయకులు శుక్రవారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. జేసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను అభినందించారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్యభాస్కరరావు, జిల్లా కార్యదర్శి స్వామి కిరణ్, జిల్లా మీడియా ఇన్‌ఛార్జి వీరా వీరాంజనేయులు, కడియపులంక ఆంజనేయ పూలరైతు వర్తక సంఘం అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు తదితరులు జేసీని కలసిన వారిలో ఉన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కారం

అనపర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన జుత్తుక సూర్యకుమారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం సత్కరించారు. అలాగే ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కర్రి సత్యగౌరి, ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బేరా వేణమ్మలను శుక్రవారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి రామవరంలోని కూటమి కార్యాలయంలో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, అందుకు అనపర్తికి నియోజకవర్గంలో మహిళలకు కేటాయించిన ఈ పదవులే సాక్ష్యమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పనులు పూర్తిచేయండి: కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరంలో పద్మావతి నగర్‌లో నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను, పార్కును, హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్ వద్ద డూస్ అండ్ డూనాట్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, అక్కడే నేషనల్ హైవేవైపు లైటింగ్ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని సమయానికి పూర్తిచేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది మరింత వేగంగా పనిచేయాలని ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు.

రేపు రాజమహేంద్రవరానికి రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రారంభమై శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర మాలల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ ఈ నెల 7న ఆదివారం రాజమహేంద్రవరం చేరుకుంటుందని జిల్లా మాల ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, ప్రముఖ న్యాయవాది మర్రి బాబ్జిలు తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక అండర్ గ్రౌండ్ సమీపంలోని అంబేడ్కర్ భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్ రద్దు చేయాలని, ప్రైవేట్ రంగంలోను, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు అమలుచేయాలని, ఎస్సీలకు రిజర్వేషన్లు 20శాతం పెంచాలనే డిమాండ్లతో ర్యాలీ జరుగుతోందని చెప్పారు.

డీజేలకు అనుమతి లేదు

కడియం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాల సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలకు అనుమతి లేదని వినాయక కమిటీ సభ్యులకు సీఐ ఎ.వెంకటేశ్వరరావు సూచించారు. బాణసంచా కాల్చు చేయరాదన్నారు. మద్యం, మత్తుపానీయాలు తాగకూడదని, ఆకతాయిలు అల్లర్లు చేయకుండా కమిటీ చూసుకోవాలని వివరించారు.

పుణ్యక్షేత్రంలో విదేశీ పక్షుల సంరక్షణ కేంద్రం!


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామంలో రూ.4 కోట్లతో విదేశీ పక్షుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో అటవీ శాఖాధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు.విదేశీ పక్షుల సంరక్షణ, సందర్శకులకు సదుపాయాలతో పర్యాటక ఆకర్షణ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. విదేశాల నుంచి వలస వచ్చి సందడి చేస్తున్న పక్షులను గ్రామస్థులు తమ ఆడపడుచులుగా భావించి ప్రేమగా చూసుకుంటారన్నారు.దేశ ఎల్లలు దాటి వేలాది మైళ్లు ప్రయాణించి, సుమారు ఆరు నెలల పాటు (శీతాకాలం)లో పుణ్యక్షేత్రం గ్రామానికి విడిదిగా చేసుకుంటాయన్నారు. గ్రామంలో చెరువు గట్టుపై ఉన్న చెట్లపై గూళ్లు కట్టుకుని నివసిస్తూ ప్రజలకు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. దాదాపు 125 సంవత్సరాలుగా ఈ విదేశీ పక్షులు పుణ్యక్షేత్రం వస్తున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఊర చెరువును అభివృద్ధి చేసి సందర్శకులకు అనుకూలంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడతామన్నారు. పక్షుల ఆవాసానికి అనువుగా నిర్మాణాలు చేపడతామన్నారు. పక్షులను తిలకించేందుకు ప్రత్యేకించి వాచ్ టవర్లు, చిల్డ్రన్ ప్లే జోన్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వివరించారు. టూరిస్టులకు మాత్రమే కాకుండా విద్యార్థులు, పరిశోధకులు, పక్షి ప్రేమికులకు ఉపయుక్తంగా ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం జిల్లా ఫారెస్టు ఆఫీసర్ వి.ప్రభాకరరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మావతి దేవి తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల

ప్రజా సంక్షేమమే లక్ష్యం

సీతానగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్లెబాట-జనవాణి కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగంపల్లి, చీపురుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. జనవాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు.ముందుగా నాగంపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి సాధారణ, నేత్ర, దంత వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కందికట్ల రత్నంరాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జనసేన నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిక్కవోలుకు పోటెత్తిన భక్తులు

- లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు
- స్వామి దర్శనానికి బారులు
- కోర్కెలు తీర్చమని వినాయకుడి చెవిలో చెప్పుకున్న భక్తులు


బిక్కవోలు లక్ష్మీగణపతి చెవిలో కోర్కెలు చెబుతున్న భక్తులు

బిక్కవోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయం భక్తులతో పోటెత్తింది. చవితి ఉత్సవాలు 9వ రోజు కావడంతో అధిక సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం ఉదయం నుంచి బారులు దీరి స్వామిని దర్శించి చెవిలో కోర్కెలు తీర్చమని చెప్పుకున్నారు. గ్రామానికి చెందిన బుద్దాల కన్నారావు బ్రదర్స్ అన్నదాన ఏర్పాట్లు చేశారు. ఆలయార్చకులు లక్ష్మీగణపతి హోమం, మూలమంత్రపూజలు, మంత్ర జపతర్పణ, హవనాలు, ఉపనిషత్తు పారాయణాలు జరిపారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి,సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక కొత్తపేటలోని శ్రీకృష్ణుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. 50 మంది చిన్నారులు పాల్గొని సరస్వతి పూజలు చేశారు. వారికి నూకమాంబ యూత్ పలక, బలపం, పుస్తకాలు కానుకగా అందజేశారు.

సహస్ర దీపాలంకరణ


రాజమహేంద్రవరంలో సహస్ర దీపాలంకరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక 23వ వార్డు నందివాడవారి వీధిలోని శ్రీవజ్ర గణపతి నవరాత్రి ఉత్సవాలు శ్రీసాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి మండపం వద్ద సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పొత్తూరి వెంకట సత్యనారాయణ, సుమ దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. స్వామి వారికి ఏకదశ హారతులిచ్చారు. కార్యక్రమంలో వాకచర్ల సూర్యకుమారి, పూసరపు ఆశ, వీవీఎన్ హిమబిందు, పేరకం అనంతలక్ష్మి తదితర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయక ఊరేగింపు

రంగంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజోతి): శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు శుక్రవారం మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి తీన్మార్ వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం రాజమహేంద్రవరం తీసుకెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు.


రంగంపేటలో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు

ఉత్తమోపాధ్యాయులకు సత్కారం

రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు


కలెక్టర్ ప్రశాంతి నుంచి అవార్డులు అందుకుంటున్న శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, వీసీ జాకబ్

రంగంపేట/అనపర్తి/కోరుకొండ, సెప్టెంబరు 5(ఆంధ్రజోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులకు శుక్రవారం అవార్డు లు అందజేశారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావుల చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. రంగంపేట మండలం నుంచి చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంట రమణబాబు, రంగంపేట హైస్కూల్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడు వీసీ జాకబ్, జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ, వడిశలేరు హైస్కూల్ నుంచి జి.ఇందుమతి, జి.దొంతమూరు హైస్కూల్ నుంచి టి.కృష్ణమోహన్, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, సింగంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ఎస్ గౌతంకృష్ణ అవార్డులు అందుకున్నారు. అనపర్తి మండలం నుంచి అనపర్తి ఎస్ఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి, పులగుర్త ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి, పేరా రామచంద్రపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వి.పద్మశ్రీ, కుతుకులూరుకు చెందిన ఉపాధ్యాయుడు కె.లూధర్‌పాల్ అవార్డులు అందుకున్నారు. కోరుకొండ మండలం మధురపూడి జడ్పీ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొడ్డేటి వెంకట్రావు, దోసకాయలపల్లి జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు సాంబశివరావు, గాడాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా నల్లల వీరవెంకట శ్రీనివాసరావు, పశ్చిమగోనగూడెం-2 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బీఎస్‌పి లక్ష్మి, గాడాల-2 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.పూర్ణచంద్ర రెడ్డి అవార్డులు అందుకున్నారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు జిల్లా ఉపాధ్యాయ అవార్డులను కోరుకొండ మండలానికి చెందిన గణిత హెడ్ మాస్టార్ ముత్యం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.భగవాన్, రషీమా, మండల స్థాయిలో 8 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను పలువురు ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

హోంగార్డ్స్ డీఎస్పీకి ఉద్యోగోన్నతి.. బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హోంగార్డ్స్ విభాగానికి డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న కేఎస్ఎస్ శ్రీనివాస్‌కి అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి లభించింది. ఏఆర్ విభాగానికి అడిషనల్ ఎస్పీగా నంద్యాల జిల్లాకు వెళుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఎస్పీ నరసింహ కిషోర్ శుక్రవారం సత్కరించారు. పోలీసులు కృషి, నిజాయితీ, క్రమశిక్షణతో పని చేస్తే ఉద్యోగోన్నతులు సహజంగానే లభిస్తాయన్నారు. హోదా పెరిగితే బాధ్యతలు, నిబద్ధత, సేవాభావం మరింతగా పెరుగుతాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో శాఖకు సేవలు అందించాలని సూచించారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ

బిక్కవోలు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆనందోత్సాహాల నడుమ ఇస్లాం మత స్థాపకుడైన ప్రవక్త మహ్మద్ జన్మదిన వేడకలను(మిలాద్ ఉన్ నబీ) మండలంలో ముస్లింలు శుక్రవారం నిర్వహించుకున్నారు. బిక్కవోలులో మదీనా మసీదు గురువు మహ్మద్ షెహజాద్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి స్వీట్లు పంచారు. పందలపాక, బలభద్రపురం గ్రామాల్లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీని నిర్వహించారు.

కడియంలో వైద్య శిబిరం

కడియం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కడియంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నర్సరీ రైతు వెన్నపు మణికంఠస్వామి (అయ్యప్ప) పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ప్రారంభించారు. రాజమహేంద్రవరం గాంధీ హాస్పిటల్, శ్రీమహేశ్వరి దంత వైద్యశాల, సాహితీ కంటి ఆస్పత్రి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, ఆదిమూలం సాయిబాబా, తమ్మిశెట్టి ప్రసాద్, చిక్కాల ఈశ్వరరావు, పడాల గోవిందు, అయ్యప్ప మిత్ర మండళ్లు పాల్గొన్నాయి.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

రాజానగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ వివరాల ప్రకారం.. రాధేయపాలెం, చక్రద్వారబంధం మధ్య తోటల్లో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో బాటు, ఒక కారు, ఆటో, 7 సెల్‌ఫోన్లు, రూ5,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజానగరం, గండేపల్లి, సామర్లకోటకు చెందిన వ్యక్తులు ఉన్నారు.

51 మద్యం సీసాలు స్వాధీనం

అనపర్తి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపర్తిలో శుక్రవారం రంగంపేట ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న తేతల వీర్రాఘవరెడ్డిని అరెస్టు చేసి అతడి నుంచి 51మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సుధ తెలిపారు.

ధర్మేష్‌కు తొలి జాస్తి యువకవి పురస్కారం

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబర్5(ఆంధ్రజ్యోతి): స్థానిక మోరంపూడిలో జాస్తి బుల్లెమ్మాయి విద్యాసంస్థల సౌజన్యంతో సాహితీ గోదావరి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యువ కవుల కవితల పోటీల్లో బొబ్బర్లంక గ్రామానికి చెందిన నక్కిన ధర్మేష్ రాసిన కవిత ఉత్తమ కవితగా ఎంపికయ్యింది. తొలి జాస్తి యువకవి పురస్కారాన్ని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జాస్తి జనార్దనమూర్తి అందజేశారు. కవులు, గ్రామస్థులు ధర్మేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

శ్రీ గురుభ్యోనమః

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
పలువురు ఉపాధ్యాయులకు సత్కారం


వేమగిరితోటలో పద్మశ్రీని సత్కరిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్స వాన్ని శుక్రవారం పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రాజమహేంద్రవరం లోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనంద గార్డెన్స్‌లో వాకర్స్ యోగా క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు మొల్లేటి సూర్యనారాయణ, తాళ్ళూరి సునీల్‌కుమార్, షేక్ మదీనా బాషా, గుబ్బల గంగాభవాని విచ్చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు నగదు, వృద్ధులకు పించన్లు పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు సామర్తి గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భేరి రత్నాంబ, గీసాల బాపూజీ, రాళ్లబండి సత్యవాణి, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్ వాకర్ పార్కులో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నామవరం,శాటిలైట్ సిటీ జడ్పీ హైస్కూలు సైన్స్ ఉపాధ్యాయురాలు సునసత్యాసురేఖను సన్మానించారు. ఆమె సైన్స్ సబ్జెక్టులో అనేక పరిశోధనలు చేశారని, విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెంచేందుకు కృషి చేశారని సభ్యులు అన్నారు.

కడియం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వేమగిరితోట 0413188 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ యనమదల రోహిణీపద్మశ్రీని చిన్నారుల తల్లులు, మహిళలు సత్కరించారు. రెండు దశాబ్దాలుగా చిన్నారుల అభివృద్ధికి పద్మశ్రీ చేస్తున్న కృషిని వారు అభినందించారు.ఆమెకు ఎమ్మెల్యే గోరంట్ల ఫోను ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు అని ఆయన అన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పితాని శివరామకృష్ణ, జోగి చక్రవర్తి, సీహెచ్ ఈశ్వర్, జి.రవి, శీలం నాగేశ్వరరావు, ఆర్.స్వామి, వై.నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యుఓ డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలకుగాను ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ అధికారులను(హెచ్‌డబ్ల్యుఓ) జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సత్కరించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తమ హెచ్‌డబ్ల్యుఓలుగా ఎంపికైన ఇసుకపట్ల రాజేష్ (ఆనంద నిలయం ప్రీ మెట్రిక్ బాలురు), జి.శ్రీదేవి (కాలేజీ గరల్స్ హాస్టల్ నెం.1)లను ఏఎస్‌డబ్ల్యుఓ పీవీ సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సుబ్బలక్ష్మి, దానబాబు, భాషా, ప్రభావతి, సత్యవతి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ: గురుపూజోత్సవం సందర్భంగా ఎంఈవో టి.కుశలవ దొర దంపతులను మండల ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు సమక్షంలో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, పీఆర్టీయూ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వెంకటరామారావు, చేబ్రోలు వెంకటాచలం, రాష్ట్ర గెజిటెడ్ హెడ్ మాస్టర్ల సంఘం గౌరవాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా కాట్వా సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని ఎంఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భావి తరాలకు దిశానిర్దేశం చేసే విధంగా విద్యాబోధన ఉండాలన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, దత్తుడు శ్రీను, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, మల్లిడి నారాయణరెడ్డి, మల్లిడి అనంతరెడ్డి, ప్రిన్సిపాల్స్ తాడి సతీష్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయులను సత్కరించిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు


హెచ్‌డబ్ల్యుఓలను సత్కరిస్తున్న ఏఎస్‌డబ్ల్యుఓ సత్యనారాయణ

ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీకి వస్తాం!

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్.. మిథున్‌రెడ్డితో ములాఖత్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఇస్తే అసెంబ్లీ సమావేశాలకు వస్తామని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ వివర్శించారు. సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తమ్మినేని, కర్నాటకలోని సింగనాయికనహళ్లి ఎమ్మెల్యే (బీజేపీ) విశ్వనాథన్, టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ విష్ణురెడ్డి శుక్రవారం ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం విశ్వనాథన్ వెళ్లిపోగా సీతారామ్ మాట్లాడుతూ మిథున్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని బయటకు వస్తారన్నారు. జైలులో పెట్టిన వాళ్లందరూ దోషులే అయితే ఏడాది కిందట జైలులో ఉన్న వ్యక్తి ఏమిటని సుద్దపప్పా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామని చెప్పారు. మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం ఆలస్యమవుతుందని చెప్పడానికి వాళ్లెవరన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలుగుతోందని చెప్పారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం సరికాదన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ అరెస్టు చేసి రోజులు గడుస్తున్నా ట్రయిల్ చేయడం లేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి స్థాయి విచారణ ఉంటుందన్నారు. జగన్ తెచ్చిన మెడికల్ కాలేజీల్లో 10 కాలేజీలను అమ్మేస్తున్నారన్నారు. మెడికల్ సీట్లు పెంచకుండా ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవని తమ్మినేని సీతారాం మాట్లాడడంపై అందరూ హతాశులయ్యారు.

విద్యావ్యవస్థను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చక్కదిద్దాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదివించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అలాగే గత ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బొమ్మూరు సాహిత్యపీఠానికి ఇంతవరకు వీసీ, రిజిస్ట్రార్, ఇతర సిబ్బందిని నియమించలేదని ఇలాగైతే అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. స్థానిక హోమియో కళాశాలలో పీజీ అడ్మిషన్లను పునరుద్ధరించేలా ఎమ్మెల్యే వాసు చొరవ తీసుకోవాలన్నారు.

దండాలయ్యా..దీవించయ్యా!



గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు.. ఎక్కడా ఖర్చుకు వెనకాడకుండా సాగనంపుతున్నారు.. ఉండ్రాజవరం మండలం తాటిపర్రులో గౌడ సేవా సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపునకు ఏర్పాటు చేసిన వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. ట్రాక్టరును అలంకరించిన తీరు ఆకట్టుకుంది.. పెరవలి మండలం తీపర్రు కాపుల వీధిలో రూ. 3 లక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి.. శనివారంతో ముగియనున్నాయి..

- పెరవలి/ ఉండ్రాజవరం

జేసీగా మేఘ స్వరూప్



రాజమహేంద్రవరం,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వై.మేఘ స్వరూప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఆమె మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో జాయింట్ కలెక్టర్ పాత్ర అత్యంత కీలక మన్నారు. మేఘ స్వరూప్ 2020 సివిల్స్‌లో 31వ ర్యాంకు సాధించి శిక్షణ అనంతరం 2021లో విధుల్లో చేరారు. అనంతపురం జిల్లా గూటీలో పాఠశాల విద్య, వారాణసీలోని హిందూ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. తొలి పోస్టింగ్‌లో అనంతపురం మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.



ముస్లింల శాంతి ర్యాలీ



ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రాజమహేంద్రవరంలో శుక్రవారం భారీ శాంతి ర్యాలీ చేశారు. ఆజాద్ చౌక్ నుంచి అప్సర థియేటర్, డీలక్స్ సెంటర్, మెయిన్ రోడ్డు, పుష్కరఘాట్, దేవిచౌక్, కంబాల చెరువు, మల్లయ్యపేట ,క్వారీ సెంటర్, రామాలయం జంక్షన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ దానవాయిపేట మసీదు వద్ద ముగిసింది. - రాజమహేంద్రవరం సిటీ



ఆకాశమే హద్దు!

భవన నిర్మాణాల ఎత్తు 24 మీటర్లకు పెంచే యోచన

నగరాల్లో భవనాల ఎత్తు పెరగనుంది. అవసరమైతే పెంచుకోవడానికి, కొత్తవి పెంచి కట్టుకోవడానికి అవకాశం కలగనుంది. రాష్ట్రంలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నట్లు పొరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తాజాగా ప్రకటించారు.దీనిపై శాసనసభలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెరుగుతున్న జనాభా అవసరాలు, పట్టణాభివృద్ధి దృష్ట్యా ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

(రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్- ఆంధ్రజ్యోతి)

ఇక అపార్ట్‌మెంట్లు ఆకాశహర్మ్యాలు కానున్నాయి. ఇప్పటి వరకూ ఐదంతస్తుల వరకే భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. అంటే 18 మీటర్ల కంటే ఎత్తు దాటి అపార్టుమెంట్లు,ఇతర భవనాలు నిర్మించకూడదు. 18 మీటర్ల ఎత్తు దాటితే వాటిని హైరైజ్ భవనాలు కింద పరిగణిస్తారు. వాటి నిబంధనలు,అనుమతులు వేరేగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం ఈ నిబంధన సడలించనుంది. సాధారణ అపార్ట్‌మెంట్ల ఎత్తు 24 మీటర్ల వరకూ పెంచనుంది.అప్పుడు ఏడం తస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం ఉంటు ంది.

జనం ఎదురుచూపులు..

ఇంత వరకూ సుమారు 400 గజాల్లో నాలు గంతస్తులు, 600 గజాల్లో ఐదంతస్తులు కట్టుకునేందుకు అనుమతి ఉంది. భవనాల ఎత్తును 24 మీటర్లకు పెంచడం వల్ల ఏడంతస్తులు కట్టుకోవచ్చు. స్థలం ఎక్కువ ఉంటే హైరైజ్ భవనాలు నిర్మించుకోవచ్చు. హైరైజ్ నిర్మాణాలకు అదనంగా సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డెవలప్ మెంట్ అథార్టీలు, రేలా అనుమతులతో పాటు ఎయిర్‌పోర్ట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ల అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. భూమి విలువ పెరగడం వల్ల హైరైజ్ భవన నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.దీంతో తక్కువ భూమిలో ఎక్కువ మంది నివసించే అపార్టుమెంట్ కల్చర్ మరింత పెరగనుంది.

కీలక మలుపు..

భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18మీటర్ల నుంచి 24మీటర్లకు పెంచే నిర్ణయం రాష్ట్ర పట్టణాభివృద్ధిలో కీలక మలుపుగా భావించవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లతో పాటు కాకినాడ జిల్లాలో నాలుగు, కోనసీమలో మూడు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మునిసిపాలిటీలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు సమతుల్యత కలుగుతుంది. బిల్లు శాసనసభలో ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర నిర్మాణ రంగం కొత్త దిశగా పయనించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ఇప్పటి వరకు ఐదంతస్తుల భవనాలే ఎక్కువగా నిర్మించారు. ఇకపై ఏడంతస్తుల భవనాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎత్తు మార్పు నిర్ణయం వల్ల కార్పొరేషన్లు, మున్సిపాల్టీలోని పట్టణ ప్రణాళికలో మార్పులు తప్పనిసరి కానున్నాయి. భవన సముదాయాల ఎత్తు పెరగనుండడంతో ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు నీరు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

తాజా నిర్ణయంతో లాభాలు

నగరాభివృద్ధికి ఊతం : భూమి వినియోగం సమర్థవంతం అవుతుంది.
గృహావసరాలు తీర్చడం : మరిన్ని ప్లాట్లు, అపార్టుమెంట్ల నిర్మాణానికి అవకాశం.
వాణిజ్య వృద్ధి : షాపింగ్‌మాల్స్, ఐటీ టవర్స్, వాణిజ్య సముదాయాలకు మార్గం.
ఆర్థిక లాభాలు : పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగనున్నాయి.

5 కాదు..ఏడంతస్తులు

హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఇప్పటికే ఆకాశహర్మ్యాలు నిర్మించారు. 150 మీటర్ల ఎత్తు వరకూ అనుమతి స్తున్నారు. 35 నుంచి 40 అంతస్తులు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మన ప్రాంతాల్లో అంత ఎత్తులో భవనాలు నిర్మించడానికి గతంలో అనుమతులు లేవు. సాధారణ అపార్ట్‌మెంట్లను ఐదంతస్తుల వరకే పరిమితం చేశారు.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ అపార్ట్ మెంట్లను ఏడంతస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 8 వరకూ హై రైజ్ భవనాలు ఉన్నట్టు అధికారుల కథనం.

- ఇప్పటి వరకూ ఐదంతస్తులే
- 18 మీటర్లకే అనుమతి
- ఇక ఏడంతస్తుల మేడలు
- ఇక అన్నీ హైరైజ్ భవనాలే
- త్వరలో శాసనసభలో చర్చ
- ఎస్ఎఫ్‌టీపై అయోమయం
- పట్టణాభివృద్ధికి దోహదం
- నిర్మాణ రంగానికి కొత్త ఊపు
- మారనున్న పట్టణ ప్రణాళిక

అధిక ఇసుక లోడు.. కలెక్టర్ చర్యలు





రెండు లారీలపై కేసులు బుక్ చేస్తున్న జిల్లా రవాణా అధికారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖాధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు చేయవలసిన పనిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేసి చూపించారు.. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఇసుక లోడు చేయడంతో పాటు టార్పాలిన్ కప్పకుండా వెళుతున్న రెండు లారీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారికి అప్పగించారు. దీంతో ఆయన రూ. 1.20 లక్షల అపరాధ రుసుం విధించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం సాయంత్రం హుకుంపేట, పద్మా వతి నగర్‌లో పర్యటించి వస్తుండగా లాలా చెరువు వద్ద అధిక ఇసుక లోడుతో టార్పాలిన్ కప్పకుండా వెళుతున్న లారీ కనిపించింది. దాని వెనుక మరో లారీ ఉంది.ముందుకు వెళ్లి లారీని ఆపించి,అధిక లోడుపై ఆరాతీశా రు.అనంతరం అక్కడే లారీలను ఆపించి దీనిపై చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారిని ఆదేశించారు.ఈ మేరకు జిల్లా రవాణా అధికారి సురేష్ ఏపీ 13యుహెచ్9369 వాహనంపై చర్యలు తీసు కుంటున్నామని, రెండు లారీలపై కేసులు బుక్ చేసి, రూ.1.29 లక్షల అపరాధ రుసుం విధించారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, డీఈవో వాసుదేవరావు తదితరులు



గురుపూజోత్సవంలో భాగంగా అలరించిన యువతుల నృత్య ప్రదర్శన

సమాజ ఉన్నతిలో గురువుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజ ఉన్నతిలో గురువుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి హాజరై మాట్లాడారు. గంట కొడితే ప్రసంగం ఆపే వ్యక్తి ఉపాధ్యాయుడు.. గంట కొట్టినా ప్రసంగం ఆపని వారు రాజకీయ నాయకులని సభలో నవ్వులు పూయించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నోబెల్ వృత్తి అని మన జీవితాన్ని ప్రభావితం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల ప్రభావం ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు.తాను కూడా ఒక టీచర్ బిడ్డనే అని గర్వంగా చెబుతున్నానన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పిల్లల జీవితాలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత కీలకంగా వ్యవహరించేది గురువులేనన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురువుల నుంచి ఆధునిక బోధకుల వరకు అందరూ పూజనీయులన్నారు. విద్యావిధానంలో సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారతీయ సంస్కృతి వికాసానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వదేశీ వస్తువులనే వినియోగించాలని పిలుపునిచ్చారు. నూతన జేసీ వై.మేఖ స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానంతో పాటు విలువలను ఉపాధ్యాయులు అందించాలన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తొలుత మాజీ రాష్ట్రప తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు, స్పెషల్ గ్రేడ్ టీచర్స్, ఉపాధ్యాయులు 87 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమం లో ఆర్ డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, డీఈవో కంది వాసుదేవరావు, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్,డీఐ బి.దిలీప్ కుమార్,ఎంఈవో తులసీదాస్ పాల్గొన్నారు.

87 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

గ్రామం	పేరు	స్కూల్
అనపర్తి	పి.వెంకటరెడ్డి	జడ్పీహెచ్ఎస్
పులగుర్త	కె.సీతామహాలక్ష్మి	జడ్పీహెచ్ఎస్
గోపాలపురం	కె.నారాయణరావు	జడ్పీహెచ్ఎస్
దుళ్ల	బి.సుధ	జడ్పీహెచ్ఎస్
కొవ్వూరు	టీఎస్.రామానుజం	జడ్పీహెచ్ఎస్
పెనకమెట్ట	క్షమాకుమార్	జడ్పీహెచ్ఎస్
నిడదవోలు	ఎస్.భీమారావు	ఎంపీఎల్‌హెచ్
పెరవలి	కె.ఉమ	జడ్పీహెచ్ఎస్
కాతేరు	డి.అనిత	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	ఆర్.సన్యాసిరావు	ఎంపీఎల్‌హెచ్
పేరారామచంద్రపురం	వి.పద్మశ్రీ	జడ్పీహెచ్ఎస్
పందలపాక	డి.యువ రాజారెడ్డి	జడ్పీహెచ్ఎస్
మెల్లూరు	ఎండీ రసూల్ షరీఫ్	జడ్పీహెచ్ఎస్
ఇల్లపల్లి	ఎం.శారదాజ్యోతి	జడ్పీహెచ్ఎస్
దేవరపల్లి	ఓ.నాగరాజు	జడ్పీహెచ్ఎస్
దేవరపల్లి	కొయ్యల శ్రీనివాసరావు	జడ్పీహెచ్ఎస్
గోకవరం	ఆర్.కృష్ణవేణి	జడ్పీహెచ్ఎస్
గోపాలపురం	వై.దుర్గాప్రసాద్	జడ్పీహెచ్ఎస్
కడియం	యర్రంశెట్టి సూరిబాబు	జడ్పీహెచ్ఎస్
మధురపూడి	బొడ్డేటి వెంకట్రావు	జడ్పీహెచ్ఎస్
దోసకాయలపల్లి	బి.సాంబశివరావు	జడ్పీహెచ్ఎస్
పశివేదల	జీవీ.నాగతులసి	జడ్పీహెచ్ఎస్
పంగిడి	ఎస్‌కే.రషీదా	జడ్పీహెచ్ఎస్
తోగుమ్మి	జే.ప్రసన్నలక్ష్మి	జడ్పీహెచ్ఎస్
ముప్పవరం	ఎం.సత్యశ్రీనివాస్	జడ్పీహెచ్ఎస్
కోలమూరు	జి.ఫణీష్‌బాబు	జడ్పీహెచ్ఎస్
శాటిలైట్ సిటీ	వి.శ్రీనివాసు	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	సీహెచ్‌వీ.ప్రసాదరావు	ఎంపీఎల్ఎస్
	బీహెచ్.జేమిన	లూథరన్ ఎయిడెడ్
	బి.విజయకుమారి	ఎస్‌కేవీటీ
తుంగపాడు	బి.శ్రీను	జడ్పీహెచ్ఎస్
వెలుగుబంద	వై.అర్నేశ్వరరావు	జడ్పీహెచ్ఎస్
జి.దొంతమూరు	పి.కృష్ణమోహన్	జడ్పీహెచ్ఎస్
రంగంపేట	వి.క్రిష్టియన్ జాకబ్	జడ్పీహెచ్ఎస్
మిర్తిపాడు	రాపాక సూరిబాబు	జడ్పీహెచ్ఎస్
తిరుగుడుమెట్ట	పి.శ్రీనివాసరావు	జడ్పీహెచ్ఎస్
తాళ్ళపూడి	ఎం.రాజకుమారి	జడ్పీహెచ్ఎస్
చాగల్లు	వి.రామలక్ష్మి	ఎంపీపీఎల్ఎఫ్
వేళ్లచింతలగూడెం	ఎస్‌సీహెచ్.రత్నకుమారి	ఎంపీపీఎస్
వాడపల్లి	బి.ప్రసాద్	ఎంపీపీఎస్-2
నల్లజర్ల	మానుకొండ గంగరాజు	ఎంపీపీఎస్-1
రాజమండ్రి	ఎస్ఎస్‌వీ.రామారెడ్డి	ఎంపీపీఎస్
చాగల్లు	పి.శ్రీనివాసమూర్తి	ఎంపీపీఎస్
చంద్రవరం	రాజన రామాంబ	ఎంపీయూపీఎస్
యర్నగూడెం	పుల్లాకుల గంగరాజు	ఎంపీపీఎస్
మల్లవరం	యాళ్ళ అబ్రహాం పౌలు	డీవీఆర్ఎయూపీ
కామరాజుపేట	చొల్ల రాజ్‌కుమార్	ఎంపీపీఎస్
చిట్యాల	సీహెచ్ సూర్యచంద్రం	ఎంపీపీఎస్
కడియం	కరటపు గంగాభవాని	ఎంపీపీఎస్-2
వెంకాయమ్మపేట	ఎంబీ.రత్నం	ఎంపీపీఎస్
వెస్ట్‌గానుగూడెం	బీఎస్ఏ.లక్ష్మి	ఎంపీపీఎస్-2
గాడాల	కే.పూర్ణచంద్రారెడ్డి	ఎంపీపీఎస్-2
తెలికిచర్ల	పాలరత్నాల నాగరాజు	ఎంపీపీఎస్ -1
ఘంటావారిగూడెం	ఎం.శ్రీనివాసరావు	ఎంపీపీఎస్ -3
పందలపర్రు	డి.భాస్కరం	ఎంపీపీఎస్-2
పెరవలి	పి.శ్రీనివాసకుమార్	ఎంపీపీఎస్
లంకమాలపల్లి	కే.దుర్గాదేవి	ఎంపీపీఎస్
రాజవోలు	వీటీఎస్‌కే.ప్రసాద్	ఎంపీపీఎస్
వెలుగుబంద	బి.పవన్ కుమార్	జడ్పీహెచ్ఎస్
కొండగుంటూరు	మావులు భగవాన్	ఎంపీపీఎస్
రామకృష్ణాపురం	ఆర్.వెంకటేశ్వరరావు	ఎంపీపీఎస్
సింగంపల్లి	సీహెచ్ గౌతమ్ కృష్ణ	ఎంపీపీఎస్
బొబ్బిల్లంక	ఏ.మేరికుమారి	ఎంపీపీఎస్
రఘుదేవపురం	జీవీ.పల్లయ్యగుప్తా	ఎంపీపీఎస్-2
గజ్జరం	వై.శంకరం	ఎంపీపీఎస్
కాల్దరి	పి.కుసుమ	ఎంపీపీఎస్-2
రాజమండ్రి	ఎంవీఎం.సుబ్రహ్మణ్య	జడ్పీహెచ్ఎస్
చంద్రేడు	జి.రమణబాబు	జడ్పీహెచ్ఎస్
పెంటపల్లి	కె.వీర్రాజు	ఎంపీయూపీఎస్
ఈస్ట్ చోడవరం	కె.సుబ్రహ్మణ్యేశ్వరస్వామి	జడ్పీహెచ్ఎస్
పెరవలి	జే.బాలకృష్ణకుమార్	జడ్పీహెచ్ఎస్
రాజమండ్రి	కె.ఉషాపద్మశ్రీ	మునిసిపల్
వడిశలేరు	జి.ఇందుమతి	జడ్పీహెచ్ఎస్
ప్రభాకర్‌నగర్	యు.రామకృష్ణ	జడ్పీహెచ్ఎస్
సింగవరం	జీవీవీ.దుర్గాప్రసాదరావు	ఎంపీపీఎస్
మలకపల్లి	ఏఎస్‌వీ.రామ్మోహన్‌రావు	జడ్పీహెచ్ఎస్
బొమ్మూరు	చిటికెన చేతనలక్ష్మి	గురుకులం
జయకృష్ణపురం	కొండ డేవిడ్‌లివింగ్‌స్టన్	ఎంపీపీఎస్
బ్రాడీపేట	ఎం.సుసన్నాజెస్సీ	ఎంపీఎల్
కడియం	పి.రామనాగేశ్వరి	జడ్పీహెచ్ఎస్
గాడాల	ఎస్‌వీబీ.శ్రీనివాసరావు	ఎంపీపీఎస్

డ్రైన్, బోరు నిర్మాణం

దేవరపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో రూ. ఐదు లక్షలతో తాగు నీటి బోరు, అలాగే మండల పరిషత్ నిధులు రూ. ఏడు లక్షలతో పక్కా డ్రైన్‌ను నిర్మించామని ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. ఈ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పచ్చా రామ్‌గోపాల్, స్థానికులు దుగ్గిన గంగాధర్, కామిశెట్టి దుర్గారావు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ● వాడవాడలా ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు ● పలువురి టీచర్లకు సన్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

నల్లజర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. శుక్రవారం నల్లజర్ల శశి స్కూల్‌లో గురుపూజోత్సవం అపస్మా (ఏపీపీయూఎస్ఎంఏ) ఆధ్వర్యంలో శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాత్మకత, సృజనాత్మకత విద్య నేడు కనుమరుగవుతోందన్నారు. ఎమ్మెల్యేగా ఈనెల వచ్చిన జీతంతో ఇంటర్ పూర్తిచేసి, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు లాప్‌టాప్, ట్యాబ్‌లు అందించారు. కార్యక్రమంలో బూరుగుపల్లి రంజిత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయ భాస్కరరావు, ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, యలమాటి శ్రీనివాస్, షేక్‌మీరా, ఎంఈవో సత్యనారాయణ, ఆంధ్రు అనిల్, లంకా సత్యనారాయణ పాల్గొన్నారు. ఉత్తమ టీచర్లకు బహుమతులు అందించారు.

కొవ్వూరు: ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, రిటైర్డ్ టీచర్లు మడిచర్ల రామచంద్రరావు, తురగ భాస్కర్‌ను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, నాయకులు బోడపాటి ముత్యాలరావు, ఎం.ఆంజనేయులు, టీఎస్వీ రమణమూర్తి, విజయవాణి, అడ్డూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఉపాధ్యాయులకు సత్కారం

ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కాకి అనిల్‌సూర్య, కోశాధికారి కంకటాల రాం బాబు, పి.వీరేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, వీ.ప్రసాద్, సాయిసతీష్, సుబ్బారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ ఆధ్వర్యంలో...

నిడదవోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురువులు దైవంతో సమానమని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ అధ్యక్షుడు పైడి సురేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలులో గురుపూజోత్సవం సందర్భంగా సమిశ్రగూడెంలోని విజ్ఞాన్ వికాస్ విద్యాసంస్థలోని 10 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నేడు సమాజంలో ఏ స్థాయిలో ఉన్నవారికైనా గురువు నుంచి నేర్చుకున్న విద్య, క్రమశిక్షణ ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్.చంద్రకిరణ్, ట్రెజరర్ జీవీవీ సత్యనారాయణ, బండి సత్యనారాయణ, బీఎస్‌వీ ప్రసాదరావు, ఎం.మధుసూదనరావు, నీరుకొండ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మిద్దే బంగారయ్య, కామిశెట్టి శ్రీనివాసరావు, పీ. నాగరాజు, జేజి భక్తవత్సలంను శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులుగా వారి సేవలను కొనియాడారు. లయన్స్ ప్రముఖులు వీవీ రామారావు, కరుటూరి సతీష్, కోడి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, పీవీ సత్తులు, కంటిపూడి అచ్యుతరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక భాష్యం స్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. అత్యంత గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుని ప్రోత్సాహం ఉంటుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సర్వేపల్లి గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఛామ్స్ ప్రిన్సిపాల్ సబానా, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోబూచులాడుతున్న గోదావరి



కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదికి వరద పోటెత్తింది. ఎగువన భద్రాచలం... దిగువన ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించినప్పటికీ ఉధృతి అలాగే ఉంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ప్రధాన స్నానఘట్టాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఎన్నడూలేని విధంగా రోజుల తరబడి పోటెత్తి ఉధృతంగా ప్రవహించడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ లక్ష్యం : ఎమ్మెల్యే



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రజల నుంచి 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధితశాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, కలగర సుబ్బారావు, ఎరుబండి వెంకట్రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ .. పేదలకు వరం : బూరుగుపల్లి



వేలివెన్నులో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శుక్రవారం వేలివెన్నులో నిడదవోలు మండలం, పట్టణం, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన మొత్తం 29 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30.78 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేసుకున్నవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థికసాయం అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మూడు మండలాలకు చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: వైద్యపరంగా పేదలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో మండలంలోని పలువురికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఇందులో తీపర్రుకు చెందిన శంకు శివ రామకృష్ణకు మంజూరైన రూ. 46 వేల చెక్కును అందజేశారు.

కార్యక్రమంలో తీపర్రు సొసైటీ అధ్య క్షుడు కంటిపూడి సూర్యనారాయణ, టీడీపీ అధ్యక్షుడు మొగళ్లపు సీతారామ్, నందమూరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

చాగల్లు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చాగల్లుకు చెందిన బహుజన వాది, కవి నేలపూరి రత్నాజీ నేను మాట్లాడుతూనే ఉంటా అనే వచన కవితా సంపుటిని రచించారు. ఈ పుస్తకావిష్కరణ సభ ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి చేతుల మీదుగా ఆవిష్కరణ ఉంటుందన్నారు. బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, తదితరులు

దేవరపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుద్దుకూరుకి చెందిన టీడీపీ కార్యకర్త గాలింకి రాజు అనారోగ్యంతో ఈనెల మూడో తేదీన మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రాజు శుక్రవారం సాయంత్రం వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ. 50 వేలను ఆయన భార్య శైలజకు అందజేశారు. రాజుకు ఇద్దరు పిల్లల ఉన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.రవికుమార్, కొయ్యలమూడి తాతారావు, కంటిపూడి సుబ్బారావు, కడియం సూర్యనారాయణ, కాకర్ల సుజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.


అందుబాటులో యూరియా

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్దూరు సొసైటీలో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీలో 6.75 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇందులో 46 శాతం నత్రజని ఉంటుందని, అవసరం మేరకే వాడాలన్నారు. వరికి చిరుపొట్ట దశలో 25 కేజీలు యూరియా, 25 కేజీల పొటాష్ వాడాలన్నారు. శనివారం కొవ్వూరు సొసైటీకి 12.6, వేములూరు 12.6, దొమ్మేరు 20 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలియజేశారు. ఏవో ఏ.గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు నాయుడు వీర్రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో ఆదాయం

చాగల్లు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన తోటల్లో బహుళ పంటలను సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చునని సీపీసీఆర్ఐ రిటైర్డ్ డైరెక్టర్ పీ. చౌడప్ప అన్నారు. శుక్రవారం కలవలపల్ల, చిక్కాలలో రైతు ముళ్లపూడి మురళీకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ తోటలో కోకో, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క అంతర పంటలుగా సాగుచేసి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం హార్టికల్చర్ జేడీ దేవమణి, జిల్లా అధికారి ఎన్.మల్లికార్జునరావు కొవ్వూరు హార్టికల్చర్ ఆఫీసర్ డీ. సుధాకర్, ఉద్యాన విభాగ శస్త్రవేత్త వీ. శివకుమార్, తదితరులు ఆ సాగు విధానాన్ని పరిశీలించారు. రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



మానవత సంస్థ ఆధ్వర్యంలో టీచర్లను సత్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత స్మార్ట్ యుగంలో గురువు స్థానం ప్రత్యేకమైనదని పలువురు వ్యక్తులు కొనియాడారు. శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాళ్లపూడి శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఐదుగురు రిటైర్డ్ ఉపాధ్యాయులైన పరస సీతారామారావు, ఏవీఎస్ నాగరత్నం, వారణాసి భాస్కర హనుమంతరావు, చామర్తి విశ్వనాథం, పరస రాధాకృష్ణను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్, చైర్మన్ సింహాద్రి జనార్దనరావు, వాసిబోయిన చంద్రయ రాజశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడికి వినతి



మంత్రికి వినతి అందజేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యో గుల సంఘం చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటరత్నం మంత్రిని కలిశారు. సూర్యనారాయణ మాట్లాడుతూ మార్కెట్ కమిటీలలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ వర్తించేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పొడిగించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఎంపిక కాలేదని.. యువకుడి ఆత్మహత్య

రాజానగరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపిక కాలేదన్న మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన ముర్ల తేజ్‌కుమార్ (30) ఇంటి వద్ద ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి నరసిహారెడ్డి ఫిర్యాదు ప్రకారం.. తేజ్‌కుమార్ గతంలో అనేక పర్యాయాలు డీఎస్సీ పరీక్ష రాశాడు. ఎంపిక కాలేదు. ఇటీవల డీఎస్సీలో సైతం ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ తెలిపారు.

సంప్రదాయబద్ధంగా ఓనం పండుగ



సంప్రదాయ దుస్తుల్లో ఏంజిల్స్ పాఠశాల ఉపాధ్యాయులు

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువోణం రోజున బలి చక్రవర్తి ఆగమనాన్ని పురస్కరించుకుని మలయాళీలు జరుపుకునే పండుగల్లో ఒకటి ఓనం అని హోలీ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ వలీయవీడు నెల్సన్ ఆంటోని అన్నారు. కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో శుక్రవారం ఓనం పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వివిధరకాల పుష్పాలతో ముగ్గులు వేశారు. మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ జరుపుకున్నారు. నెల్సన్ ఆంటోని మాట్లాడుతూ కేరళ సంస్కృతికి అద్దం పట్టే పండుగ ఓనం అన్నారు. తెలంగాణలో బతుకమ్మ, బోనాలు, ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి, తమిళనాడులో దీపావళి లాగా కేరళలో ఓనం పండుగ ఒకటన్నారు. అనంతరం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని నిర్వహించారు. దీనిలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నతశిఖరాలకు

● తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శశాంక

దేవరపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృషి పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శశాంక పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీహెచ్ఎస్ఆర్‌వీఎల్ఎం ఆనంద్ ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలోని ప్రభుత్వ బీసీ మహిళా హాస్టల్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పా ల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, మంచి పేరు తీసుకురావాలని ఆమె అన్నారు. జిల్లాలో 23 ప్రభుత్వ బీసీ మహిళా హాస్టల్స్ ఉన్నాయ న్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపా యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో ఆనంద్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, కళాశాల కరస్పాండెంట్ సువర్ణరాజు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆశావలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మద్దిపాటి చొరవతో గ్రావెల్ రోడ్డు



రోడ్డు రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

దేవరపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యాదవోలు - కన్నాయిగూడెం రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో గ్రావెల్ రోడ్డు వేస్తున్నట్టు టీడీపీ నేత నుదురుమాటి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదవోలు నుంచి కన్నాయిగూడెం వరకు పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ సహకారంతో నాలుగు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేయడం జరిగిందని, ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఎమ్మెల్యే గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులతో మాట్లాడారన్నారు. టీడీపీ, జనసేన నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జగణపయ్యా

● వాడవాడలా ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవాలు



నిడదవోలులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడి విగ్రహం

నిడదవోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెల్లివీధిలో శుక్రవారం భారీ ఊరేగింపు మధ్య వినాయకుడ్ని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత ప్రదర్శించిన కాళీకామాత నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే గణేష్ చౌక్ సెంటర్‌లోని పూజా గణపతి కుమారస్వామి ఆలయం వద్ద 103వ వార్షికోత్సవం సందర్భంగా 18 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ప్రత్యేక పూజలందు కున్న విగ్రహం వద్ద శనివారం ఉదయం మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వినాయక నిమజ్జన ఊరేగింపు ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు తెలిపారు.

ఉండ్రాజవరం: తాడిపర్రులో గౌడ సేవా సం ఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినాయకుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో తరలించారు. బ్యాం డుమేళాలు, వివిధ వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే ఉండ్రాజవరంలోనూ వరసిద్ధి వినాయకస్వామి వారిని ఊరేగించారు.

దేవరపల్లి: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయకుడ్ని ప్రత్యేక వాహనాలపై పురవీధుల్లో ఊరేగించారు. బాణసంచా, మేళతాళాలు, విచిత్రవేషధారణలు, బుట్టబొమ్మలతో సాగింది. బిక్కవోలుకి చెందిన బ్యాండ్ పార్టీ బీఎల్ నారాయణను ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, పంచాయతీ వార్డుసభ్యులు కరుటూరి బాలాజీ, జనసేన నాయకులు ఆకుల నాని, కమిటీ సభ్యులు గుడ్ల వెంకటేశ్వరరావు, కడియం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: ప్రత్యేక వాహనంపై వినాయకుడ్ని ఊరేగిస్తున్న దృశ్యం

పిచ్చికుక్క స్వైరవిహారం

● ఆవపాడులో 15 మందిపై దాడి ● భయాందోళన చెందిన గ్రామస్థులు



తీవ్రంగా గాయపడిన మహిళ

నల్లజర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవపాడులో పిచ్చికుక్క. పిచ్చికుక్క శుక్రవారం స్వైరవిహారం చేసి 15 మందిని తీవ్రంగా గాయపర్చింది. ఉదయం నుంచి గ్రామంలో పలువురి మహిళలపై దాడికి తెగపడింది. పశువులను సైతం వదల్లేదు. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఇళ్లల్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు. తర్వాత గ్రామస్థులు అప్రమత్తమై హతమార్చారు. అలాగే చీపురుగూడెంలోనూ ఓ కుక్క ఎనిమిది మందిని కరిచింది. బాధితులంతా నల్లజర్ల, వెంకట్రామన్నగూడెం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం

● మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు మదర్సాలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధనలు అందరికీ ఆచరణీయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని మదర్సాలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రవక్త సమాజానికి అందించిందన సందేశం ఎంతో విలువైనదన్నారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, గంగుల గోపీయాదవ్, ఇస్మాయిల్‌ఖాన్, పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఇద్దరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రు హైస్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయుడు జీ. శ్రీనివాస్ రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ పీ.ప్రశాంతి చేతులమీదుగా అందుకున్నారు. అలాగే కాల్ధరి నెం.3 పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు పులి కుసుమ కూడా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, కుసుమను మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ గడ్డి మందు తాగి .. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ జె.ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెనకనమెట్ట గ్రామానికి చెందిన గరగ అనంతలక్ష్మి (50) ఈ నెల 4వ తేదీన ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగింది. ఈవిషయాన్ని గమనించిన పెద్దకుమారుడు చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు డెత్ ఇంటిమేషన్ ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.